క్లుప్తంగా

పౌష్టికాహారం పంపిణీ

విజయపురం : క్షయ వ్యాధిగ్రస్తులు తప్పనిసరిగా పౌష్టికాహారం తీసుకోవాలని చిత్తూరు డీఐఓ డాక్టర్ రవిరాజు తెలిపారు. శనివారం విజయపురం పీహెచ్‌సీ, జగన్నాథపురం సచివాలయ పరిధిలోని టీబీ రోగులకు డాక్టర్ రవిరాజు పౌష్టికాహారం కిట్లను అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ క్షయవ్యాధిగ్రస్తులు తీసుకునే ఆహారంలో పౌష్టికాహారం ఉండేలా చూసుకోవాలన్నారు. పౌష్టికాహారం తీసుకుంటే రోగనిరోధక శక్తి పెరుగుతుందని, వ్యాధి నియంత్రణలో ఉంటుందన్నారు. ఆయన వెంట డాక్టర్ సోమశేఖర్ ఉన్నారు.

21న వాహనాల వేలం

పుత్తూరు రూరల్: వివిధ కేసుల్లో సీజ్ చేసిన ద్విచక్ర వాహనాలను ఈనెల 21న పుత్తూరు స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో(ఎస్‌ఈబీ) కార్యాలయంలో బహిరంగ వేలం వేయనున్నట్లు సీఐ ఎస్.కృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10.30 గంటలకు వేలం ప్రారంభమవుతుందన్నారు. ఆసక్తి గల వారు పాల్గొనవచ్చని పేర్కొన్నారు.

'మా నమ్మకం నువ్వే జగన్'ను విజయవంతం చేయండి



పాలసముద్రం: 'మా నమ్మకం నువ్వే జగన్' కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మండల కన్వీనర్ తులసి యాదవ్, జెడ్పీటీసీ సభ్యుడు అన్బలగన్ తెలిపారు. శనివారం వారు పాలసముద్రం గ్రామ సచివాలయాల పరిధిలోని గృహ సారథులు, సచివాలయ కన్వీనర్లతో ఈ కార్యక్రమంపై చర్చించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ గోవిందరాజులు, నాయకులు సుందరరాజు, చంద్రశేఖర్‌రాజు, ఆనందన్, ప్రకాష్, కుట్టి, అరుల్, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదం జరిగినా పరిహారం పొందవచ్చు

- సీనియర్ సివిల్ జడ్జి ఎస్.సి.రాఘవేంద్ర

పుత్తూరు రూరల్: గుర్తు తెలియని వాహనం ద్వారా ప్రమాదం జరిగినా నష్ట పరిహారం పొందవచ్చని స్థానిక సీనియర్ సివిల్‌జడ్జి ఎస్.సి.రాఘవేంద్ర తెలిపారు. శనివారం స్థానిక సబ్‌కోర్టులో మోటారు వాహనాల సవరణ చట్టం నియమావళిపై పోలీసులు, న్యాయవాదులు, ఇన్సూరెన్స్ అధికారులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ 357ఏ సీఆర్‌పీసీలో విక్టిమ్ కాంపన్‌సేషన్ స్కీమ్ కింద ఒక నిధి ఉంటుందని తెలిపారు. ఈ చట్టంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు బాధ్యత కల్పించారని చెప్పారు. 304ఏ, 338 కేసుల్లో ఎంవీఐ యాక్టుకు సంబంధం లేకుండా నష్ట పరిహారం ఇచ్చేవిధంగా చర్యలు తీసుకోవాలని ఉందన్నారు. ఇలాంటి వాహన ప్రమాద కేసుల్లో వాహనాన్ని గుర్తించకపోయినా కోర్టు ద్వారా నష్ట పరిహారం పొందవచ్చని వివరించారు. గుర్తు తెలియని వాహన ప్రమాదం జరిగితే వెంటనే పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేసి 48 గంటల్లో ట్రిబ్యునల్‌కు సమర్పించాలని తెలిపారు. ప్రమాదానికి కారణమైన వాహనాన్ని మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్, పోలీసు అధికారులు కలిసి గుర్తించడానికి చర్యలు చేపట్టాలన్నారు. వెహికల్ రిజిస్ట్రేషన్, ఫిట్‌నెస్, డ్రైవర్ లైసెన్స్ వంటి అంశాలపై సమగ్ర రిపోర్టును కోర్టుకు సమర్పించాలని తెలిపారు. దీనిపై కోర్టు విచారణ జరిపి ప్రమాద తీవ్రతను బట్టి నష్ట పరిహారం అందేలా చర్యలు తీసుకుంటుందని తెలిపారు. కార్యక్రమంలో జూనియర్ సివిల్‌జడ్జి వి.లీలాశ్యామసుందరి మాట్లాడారు. పుత్తూరు సీఐ లక్ష్మీనారాయణ, వడమాలపేట, కార్వేటినగరం ఎస్ఐలు రామాంజనేయులు, దస్తగిరి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జడ్జి రాఘవేంద్ర, హాజరైన పోలీసులు, న్యాయవాదులు, ఇన్సూరెన్స్ అధికారులు

వ్యాధి నిరోధక టీకాలు తప్పనిసరి

గంగాధరనెల్లూరు: చిన్న పిల్లలకు వ్యాధి నిరోధక టీకాలు వేయించాలని సీహెచ్‌ఓ శ్రీనివాసులు తెలిపారు. జీడీనెల్లూరు పీహెచ్‌సీ పరిధిలోని కలిజవేడు వెంకటాపురం గ్రామంలో శనివారం గర్భిణులు, చిన్నపిల్లలకు వ్యాధి నిరోధక టీకాలపై అవగాహన కల్పించారు. అనంతరం మాట్లాడుతూ చిన్న పిల్లలకు క్యాలెండర్ ప్రకారం వ్యాధి నిరోధక టీకాలు వేయించాలని, తద్వారా 13 ప్రాణాంతక వ్యాధుల నుంచి పిల్లలను కాపాడుకోవచ్చన్నారు. రక్తహీనత లేకుండా ఉండేందుకు గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలన్నారు. ఆరోగ్యవిద్యాధికారి కృష్ణారెడ్డి, ఏఎన్ఎం కోకిల, సిబ్బంది పాల్గొన్నారు.



వ్యాధి నిరోధక టీకాలు వేస్తున్న వైద్యసిబ్బంది

వైఎస్సార్ బీమా చెక్ అందజేత

కార్వేటినగరం: పార్టీలకు అతీతంగా వైఎస్సార్ బీమా పథకాన్ని అమలు చేస్తున్న ఘనత రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందని మండల సోషల్ మీడియా కన్వీనర్ రఫీ అన్నారు. మేజర్ పంచాయతీ కార్వేటినగరంలోని పాత సంత వీధిలో నివాసం ఉంటున్న మున్నీర్‌బాషా(46) అనారోగ్యంతో వారం క్రితం మృతి చెందాడు. అతని కుటుంబానికి వైఎస్సార్ బీమా పథకం కింద శనివారం రూ.లక్ష రూపాయల చెక్కును అందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ టీడీపీ కార్యకర్త అయిన మున్నీర్‌బాషా ఇటీవల మృతి చెందాడన్నారు. పార్టీలకు అతీతంగా వైఎస్సార్ బీమాను మున్నీర్‌బాషా కుటుంబానికి అందించినట్లు చెప్పారు. కార్యక్రమంలో వార్డు మెంబర్ షేక్ హంషీరా, మణిరెడ్డి, వెల్ఫేర్ అసిస్టెంట్ చరణ్ కుమార్ పలువురు పాల్గొన్నారు.



మున్నీర్‌బాషా కుటుంబ సభ్యులకు బీమా నగదు అందిస్తున్న సచివాయల సిబ్బంది, స్థానిక నాయకులు

బాధిత కుటుంబానికి పరామర్శ

నింద్ర: మండలంలోని శ్రీరామాపురం దళితవాడకు చెందిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యకర్త బాబు తల్లి సరోజమ్మ (56) అనారోగ్యంతో శనివారం మృతి చెందారు. రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి రోజా సోదరుడు కుమారస్వామి రెడ్డి గ్రామానికి విచ్చేసి సరోజమ్మ మృతదేహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర యువజన విభాగం ప్రధాన కార్యదర్శి శ్యామ్ లాల్, ఎంపీపీ దీప, వైస్ ఎంపీపీ శుభ, సింగిల్‌విండో అధ్యక్షుడు మునికృష్ణారెడ్డి, కోఆప్షన్ సభ్యులు అనిల్, ఎంపీటీసీ సభ్యులు విజేష్, మహేష్ తదితరులు పరామర్శించారు.

పుత్తూరుకు సబ్‌స్టేషన్ మంజూరు

పుత్తూరు రూరల్: పుత్తూరు మండలానికి 5 ఎంవీఏ సామర్థ్యం కలిగిన నూతన సబ్‌స్టేషన్ మంజూరైనట్లు ఏఈ రవికుమార్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. తిరుమలకుప్పం పరిధిలో సబ్‌స్టేషన్ ఏర్పాటుకు స్థల పరిశీలిస్తున్నట్లు చెప్పారు. సుమారు రూ.కోటి వ్యయంతో ఏర్పాటు కానున్న సబ్‌స్టేషన్‌కు 70 సెంట్ల నుంచి ఎకరా వరకు స్థలం అవసరం అవుతుందన్నారు. దీంతో గ్రామీణ ప్రాంతాల్లో లోటల్టేజీతో పాటు విద్యుత్ సమస్యలు పూర్తిగా తొలగిపోతాయన్నారు.

రూ.1.56 కోట్ల నాడు-నేడు నిధులు విడుదల

నగరి : నగరి మండలంలోని 61 పాఠశాలలకు రెండో విడత నాడు-నేడు పథకంలో రూ.1.56 కోట్ల రూపాయలు నిధులు మంజూరైనట్లు ఎంఈఓ శ్రీదేవి వెల్లడించారు. శనివారం నాడు-నేడు పనులపై అధికారులు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, సీఆర్పీలతో ఆమె సమీక్ష నిర్వహించారు. సమావేశంలో పాఠశాలలకు మంజూరైన నిధులను ఏ విధంగా ఖర్చు పెట్టాలన్న అంశంపై నివేదిక సమర్పించాలని సూచించారు. టాయిలెట్ విత్ రన్నింగ్ వాటర్, సంపు, ఓవర్ హెడ్ ట్యాంక్ పనులు విద్యార్థులకు అత్యవసరమని వీటికి మొదటి ప్రాధాన్యత కల్పించాలని సూచించారు. ఖర్చుపెట్టిన వాటికి వెంటనే బిల్లులు యాప్‌లో అప్‌లోడ్ చేయాలని డీఈ నరేష్ సూచించారు. పనుల్లో జాప్యం లేకుండా వెంటనే పూర్తి చేయాలని ఇంజినీరింగ్ అసిస్టెంట్లకు, సీఆర్పీలకు ఆదేశాలు జారీచేశారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంఈఓ, డీఈ

క్రమశిక్షణతో చదివితే ఉజ్వల భవిష్యత్

కార్వేటినగరం: విద్యార్థులు ఉన్నతస్థాయికి ఎదిగిన వారిని ఆదర్శంగా తీసుకుని మీరు కూడా భవిష్యత్‌లో ఉన్నత స్థానాన్ని అధిరోహించాలని వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి బాలాజీ అన్నారు. శనివారం ఆర్కేఎస్సార్ ఉన్నత పాఠశాల 76వ వార్షికోత్సవాన్ని హెచ్‌ఎం వైవీ వసుమతి దేవీ ఆధ్వర్యంలో ఘనంగా జరుపుకున్నారు. ఆయన మాట్లాడుతూ ఈ పాఠశాలలో విద్యనభ్యసించిన వారు ఎందరో శాస్త్రవేతలుగా, ప్రభుత్వం రంగాల్లోని అనేక ఉన్నతస్థాయి ఉద్యోగాల్లో రాణిస్తున్నారని తెలిపారు. ఆర్కేఎస్సార్‌లో విద్యను అభ్యసిస్తున్న పూర్వ విద్యార్థులు విద్యాభివృద్ధికి శాస్త్రవేత పుదూరు జగదీశ్వరన్ సేవ ఎనలేనిదని వైఎస్సార్ సీపీ మండల పార్టీ కన్వీనర్ గుర్తు చేశారు. వారితో పాటు పలువురు దాతలు అందించిన నగదును పదో తరగతిలో ఉత్తమమార్కులు సాధించిన వారికి అందిస్తూ విద్యార్థులను ప్రోత్సహించడం ఆనందంగా ఉందన్నారు. ఈ క్రమంలో భాగంగా 2022-23 సంవత్సరం పదో తరగతిలో 570 మార్కులతో మొదటి స్థానంలో నిలిచిన పీ.హర్షవర్ధినికి దాతలు రూ.40 వేలు నగదును అందించారు. అలాగే 553 మార్కులు సాధించి రెండవ స్థానంలో నిలిచిన హేమంత్‌కు రూ.15 వేలు నగదును అందజేశారు. అదేవిధంగా సబ్జెక్టుల వారిగా మొదటి స్థానం సాధించిన వారికి, అలాగే ఆటలపోటీల్లో ప్రతిభ కనబరచిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. హెచ్‌ఎం వసుమతిదేవి, ఎంపీడీఓ మోహన్‌మురళి, స్కూల్ కమిటీ చైర్మన్ మోహనకుమారి, వైస్ చైర్మన్ సప్తగిరి పాల్గొన్నారు.



విద్యార్థి తల్లిదండ్రులకు నగదు బహుమతి, షీల్డ్‌ను అందిస్తున్న బాలాజీ, హెచ్‌ఎం

ప్రకృతి వ్యవసాయంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టండి

పాలసముద్రం : రైతులు ప్రకృతి వ్యవసాయంపై దృష్టి పెట్టాలని చిత్తూరు డీపీఎం వాసు తెలిపారు. శనివారం ప్రకృతి వ్యవసాయంపై రైతులకు అవగాహన కల్పించాలన్నారు. ఆయన మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయపద్ధతుల్లో పంటలను సాగు చేయడం వల్ల రసాయన ఎరువుల వాడకం ఉండదన్నారు. జీవామృతం కాషాయాలతో సాగు చేయడంలో రైతులు ప్రత్యేక శ్రద్ధ పెట్టాలన్నారు. శ్రీకావేరిరాజుపురం రైతు భరోసా కేంద్రం పరిధిలో రైతులకు సర్పంచ్ గాలి మహేష్ బాబు సమక్షంలో ప్రకృతి వ్యవసాయం కింద సాగు చేసిన చెరకు పంటను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. వ్యవసాయ సహాయకులు వనజ పాల్గొన్నారు.

